Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

శుక్రవారం 05-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 354 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## జాతీయ స్థాయిలో సత్తా

### ఐదు ప్రతిష్టాత్మక అవార్డులు



2 లో

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐదు ప్రతిష్టాత్మక జాతీయ పంచాయతీ అవార్డులను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాలను ప్రకటించింది.

## తెలంగాణలో తొలిసారి ఎబోలా కలకలం!

### గాంధీ ఆసుపత్రికి విదేశీ ప్రయాణికుడు



2 లో

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** ఆఫ్రికా దేశాలను గడగడలాడిస్తున్న ఎబోలా వైరస్ శంషాబాద్ ఎయిర్ పోర్టులో కలకలం రేపింది. ఎబోలా వైరస్ హిస్టరీ కలిగి ఉన్న ఓ విదేశీయుడిని అధికారులు గుర్తించారు. గురువారం ఉదయం సుడాన్ దేశం నుంచి వచ్చిన ప్రయాణికుడు మహమ్మద్ గతంలో ఎబోలా వైరస్ బారిన పడ్డాడని గుర్తించారు. ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేసిన స్కానర్ ద్వారా అతడికి ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్నాయని గుర్తించిన అధికారులు వెంటనే అప్రమత్తం అయ్యారు. హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎబోలా వార్డులో ఉంచారు. నిర్ధారణ పరీక్షల కోసం అతడి శాంపిల్స్ ను వైద్యులు సీసీఎంబీకి పంపించారు. అయితే ఎబోలా వైరస్ లక్షణాలు కలిగిన వ్యక్తి తెలంగాణలో గుర్తించడం ఇదే తొలిసారి కావడంతో ఈ వ్యవహారం అందరిని ఒక్కసారిగా కలవరపాటుకు గురి చేస్తోంది.

ప్రభుత్వం పకడ్బందీ చర్యలు:

ప్రస్తుతం ఈ ఎబోలా వైరస్ మధ్య ఆఫ్రికా దేశాలైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఈ వైరస్ వ్యాప్తి తీవ్రత దృష్ట్యా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే దీనిని "గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ" గా ప్రకటించింది.

## కాక్రోచ్ పార్టీ వెనుక ఉన్నది వాళ్లే

### బీజేపీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు


2 లో

## ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ

### కీలక బిల్లులకు మంత్రివర్గం ఆమోదం


2 లో

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం సుమారు మూడు గంటలపాటు సాగింది. ఈ భేటీలో కీలక బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ -2025, ఏపీ ఏవియేషన్ పాలసీ -2026పై మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ కేబినెట్ సమావేశంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్ పై కూడా మంత్రివర్గం చర్చించింది. అలాగే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## మందుబాబులకు చేదు వార్త

- తెలంగాణలో మద్యం ధరల సవరణపై కసరత్తు




**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం ధరల సవరణపై అధ్యయనం చేయడానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ అధ్యక్షతన ఏర్పాటైన త్రిసభ్య కమిటీ బుధవారం నుండి మూడు రోజుల సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, చార్టర్డ్ అకౌంటెంట్ నవీన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. మద్యం కొనుగోలు ధరల పెంపు నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు మద్యం కంపెనీల నుంచి వస్తున్న ధరల పెంపు ఒత్తిడి, మరోవైపు ధరలు పెంచితే పొరుగు రాష్ట్రం నుండి ముంచుకొచ్చే అక్రమ మద్యం స్మగ్లింగ్ ముప్పు.. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించేందుకు ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది.

బుధవారం జరిగిన విచారణలో మద్యం తయారీ కంపెనీల ప్రతినిధులు కమిటీ ముందు హాజరై తమ నివేదికలను సమర్పించారు. మద్యం తయారీకి అవసరమయ్యే ముడిసరుకులు, ప్యాకేజింగ్ మెటీరియల్స్, రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని వారు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా తమకు లాభసాటిగా ఉండాలంటే కనీసం 10 శాతం మేర కొనుగోలు ధరలను పెంచాలని వారు అభ్యర్థించారు. అయితే మద్యం కంపెనీల డిమాండ్ సమంజసంగానే ఉన్నప్పటికీ ధరలను భారీగా పెంచితే అది రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయానికి గండికొట్టే ప్రమాదం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణ సుదీర్ఘమైన అంతరాష్ట్ర సరిహద్దును పంచుకుంటోంది. తెలంగాణలో మద్యం ధరలు గనుక విపరీతంగా పెరిగితే.. రెండు రాష్ట్రాల మధ్య రేట్ల వ్యత్యాసం భారీగా పెరుగుతుందని అంటున్నారు.

తెలంగాణలో కొనుగోలు ధరలు పెరిగితే.. అది అంతిమంగా రీటైల్ ధరలపై ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో గనుక రీటైల్ ధరలు తక్కువగా ఉంటే సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి ప్రాంతాల ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుంచి మద్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల తెలంగాణకు రావాల్సిన పన్నుల రూపంలోని భారీ ఎక్సైజ్ రాబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. అటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతూనే ఇటు సరిహద్దు ముప్పును అరికట్టేలా జస్టిస్ సునీల్ కిషోర్ కమిటీ ఎలాంటి సిఫార్సులు చేయబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# నేటి నుంచి కొత్త రేట్లు

# భూముల ధరలకు పెంపు



- రిజిస్ట్రేషన్లకు కొత్త విలువలు
- మార్కెట్ వ్యాల్యూస్ అమలు
- పాత రేట్లకు గుడ్‌బై
- భూముల విలువల రివిజన్
- ఐజీఆర్ఎస్‌లో కొత్త రేట్లు
- రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంపు
- రాష్ట్రవ్యాప్తంగా కొత్త విలువలు
- ఆదాయం పెంపే లక్ష్యం
- రూ.2 వేల కోట్లపై గురి
- కొత్త మార్కెట్ ధరల అమలు
- భూ క్రయవిక్రయాలకు జోష్
- ఒక్క క్లిక్‌తో కొత్త రేట్లు

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర, ఇండ్లు, అపార్టుమెంట్ల ధరలు పెరగనున్నాయి. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ మార్కెట్ వ్యాల్యూస్ అమలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ధరల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తయ్యింది. ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పెరిగిన ధరల డేటాను అప్‌లోడ్ చేశారు. ఐతే మంచి మహూర్తం కోసం వేచి చూస్తున్నారని ప్రచారం. ఎప్పుడైతే మార్కెట్ వ్యాల్యూస్ పెరుగుతున్నాయని ప్రకటించారో, అప్పటి నుంచి భూ క్రయవిక్రయాల జోరు పెరిగింది. ఒక్క నెలలోనే రూ.1,700 కోట్ల మేరకు ఆదాయం సమకూరింది. సాధారణంగా నెలలో రూ.1,100 కోట్లు దాటిందంటేనే రికార్డు బ్రేక్ అంటారు. అలాంటిది ఏకంగా రూ.600 కోట్లు అదనంగా లభించింది. ఇంకా స్లాట్ బుకింగ్స్ దొరక్క వేచి చూస్తున్న వారూ లేకపోలేదు. అందుకే మరో రూ.300 కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం వ్యూహాన్ని ఖరారు చేసిందని సమాచారం. అంటే రూ.2వేల కోట్లకు చేరేలా ప్లాన్ వేసినట్లు తెలిసింది. అందుకే ఈ నెల 4న పెంచాల్సిన మార్కెట్ విలువలను 5వ తేదీకి వాయిదా వేశారు.

మిగతాది 2 లో..

## వెన్నుపోటుకు రెండేళ్లు

### కౌంటర్‌గా విజయోత్సవ ర్యాలీలు


2 లో

## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

### 3 అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ దగ్ధం



2 లో

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** హైదరాబాద్ సిటీ నడిబొడ్డున ఉన్న ప్రముఖ వ్యాపార కేంద్రం అమీర్‌పేట్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మైత్రీవనం సమీపంలోని మెయిన్ రోడ్డుపై ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మూడు అంతస్తుల భవనం మొత్తం నిలువెల్లా మంటల్లో చిక్కుకుని కాలిబూడిదవుతోంది. భగభగ ఎగిసిపడుతున్న మంటల ధాటికి స్థానికులు భయంతో వణికిపోతున్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 05-06-2026

# వెన్నుపోటుకు రెండేళ్లు..
# కౌంటర్‌గా విజయోత్సవ ర్యాలీలు



**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ శ్రేణులు పరస్పర ర్యాలీలతో ఎదురుపడటంతో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరస్పర విమర్శలతో గొడవలు జరిగే ఆస్కారం ఉండటంతో పోలీసులు అలర్టయ్యారు. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో.. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ర్యాలీలకు పిలుపునిచ్చింది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రాల్లో టీడీపీ మేనిఫెస్టో, చంద్రబాబు - పవన్ కల్యాణ్ ల సంతకాలతో ఇచ్చిన బాండ్లను దగ్ధం చేయనున్నారు.

గుంటూరు, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, నంద్యాల పట్టణాల్లో వైసీపీ వెన్నుపోటు ర్యాలీలు చేస్తుండగా.. టీడీపీ శ్రేణులు వారికి కౌంటర్ గా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. రెండు గ్రూపులు తారసపడటంతో పోలీసులు అప్రమత్తమై గొడవలు జరగకుండా రూటు మార్చారు. గుంటూరు ర్యాలీలో మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి వాటిని అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చేందుకు హామీలివ్వడం, వచ్చాక వాటిని అమలు చేయకుండా కాలం గడపడం చంద్రబాబుకు అలవాటేనని దుయ్యబట్టారు. తాము గుజ్జనగుంటలో కార్యక్రమం నిర్వహించాలని ముందే నిర్ణయించుకున్నామని, అక్కడ టీడీపీ నేతలు తమ పార్టీ నాయకుల్ని రెచ్చగొట్టేలా బ్యానర్లు ఏర్పాటు చేశారన్నారు. పైగా జగన్ దిష్టిబొమ్మను పోలీసులే దగ్గరుండి దగ్ధం చేయించారని మండిపడ్డారు. గతంలో తన ఇంటిపై దాడిచేసినవారంతా.. గుజ్జనగుంటలో హడావిడి చేశారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు మంచిదికాదని తెలిపారు.

# తెలంగాణలో తొలిసారి ఎబోలా కలకలం!..
# గాంధీ ఆసుపత్రికి విదేశీ ప్రయాణికుడు

మొదటి పేజీ తరువాయి




రోజుల వ్యవధిలోనే వందలాది అనుమానిత కేసులు నమోదు కాగా పెద్ద సంఖ్యలో మరణాలు నమోదు అవుతున్నాయి. దీంతో ఈ మహమ్మారి ఇతర దేశాలకు పాకకుండా సరిహద్దు దేశాలు కూడా హై అలర్ట్ లో ఉన్నాయి. ఈ వైరస్ విషయంలో భారత ప్రభుత్వం అప్రమత్తం అయింది. తమ పౌరులకు కీలక ప్రయాణ మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించింది. ప్రస్తుతానికి భారతదేశంలో ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కానప్పటికీ విదేశీ ప్రయాణీకుల నుంచి వైరస్ మన దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉండటంతో విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘాను తీవ్రతరం చేశారు. ఈ క్రమంలో శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కానర్‌లో ఈ వైరస్ లక్షణాలు కలిగి ఉన్న సూడాన్ ప్రయాణికుడు పట్టుబడ్డాడు.

ఐసోలేషన్ నుంచి ఎబోలా పేషంట్ల పరార్:

ఆఫ్రికా ఖండంలో ఎబోలా వైరస్ విజృంభణ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ భయంతో అక్కడ ప్రభుత్వాలు చేపడుతున్న సహాయక కార్యక్రమాలపై స్థానికులు దాడులకు తెగబడుతున్నారు. తాజాగా కాంగోలోని కివులోని కటానా పట్టణంలో ఎబోలా వైరస్ బారిన పడి చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు చేస్తున్న బృందంపై కొందరు మూక దాడికి పాల్పడ్డారు. దీంతో వారు ఆ డెడ్ బాడీని అక్కడే వదిలేసి తమ ప్రాణాలు కాపాడుకునేందుకు అక్కడి నుంచి పారిపోయారు. తమ ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహిస్తే ఆ వైరస్ తమకూ సోకుతుందనే భయంతో ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉంటే ఎబోలా వైరస్ సోకిన 11 మంది పేషెంట్లు ఐసోలేషన్ కేంద్రాల నుంచి పరారయ్యారు. మరికొన్ని ప్రాంతాల్లో ఐసోలేషన్ కేంద్రాలపై స్థానికులు దాడులకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది.

# ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ..
# కీలక బిల్లులకు మంత్రివర్గం ఆమోదం

మొదటి పేజీ తరువాయి

అలాగే మానవ అవయవ మార్పిడి చట్టం అమలుడు ఆర్డినెన్స్ ను జారీచేసే ప్రతిపాదన, చీరాల, విశాఖలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు, ఎక్సైజ్ పాలసీ మార్గదర్శకాలకు, జలవనరులశాఖలో పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు కేబినెట్ అనుమతులు మంజూరు చేసింది. అగ్రిగోల్డ్ వంటి డిపాజిటర్ల కేసుల పరిష్కారానికై 21 పోస్టుల్ని నియమించేందుకు గ్రీన్ సిగ్నలిచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయశాఖ భూమిపై సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై మంత్రిమండలి చర్చించింది. అదేవిధంగా ఎన్ఆర్ఈడీక్యాప్ నకు 30 ఏళ్ల లీజు ఇచ్చేందుకు కూడా అనుమతినిచ్చింది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు హడ్కో నుంచి రూ.300 కోట్ల రుణం తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇక కృష్ణానదీతీరంలో అమరావతి ఐ ప్రాజెక్టు అభివృద్ధి టెండర్లకు మంత్రివర్గం పర్మిషన్ ఇచ్చింది. అమరావతిలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు అనుమతులిచ్చింది. నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీలో సవరణలతో పాటు వివిధ సంస్థలకు భూములు కేటాయించే విషయాలపై చర్చించి, వాటికి ఆమోదం తెలిపింది. జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వీబీ జీ రామ్ జీ అమలు ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..
# 15 వరకు సెలవులు పొడిగింపు!




**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలో తీవ్రమైన ఎండలు, వడగాల్పుల కారణంగా పలు విద్యాసంస్థలు వేసవి సెలవులను పొడిగిస్తున్నాయి. భానుడి భగభగల కారణంగా రాష్ట్రంలో డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులను జూన్ 6వ తేదీ వరకు పొడిగించగా తాజాగా అంగన్‌వాడీల వేసవి సెలవుల పొడిగింపుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం అంగన్‌వాడీ సెంటర్లకు మే 1 నుంచి జూన్ 1 వరకు సమ్మర్ హాలిడేస్ ప్రకటించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఉదయం 9 గంటలకే ఇల్లు వదిలి బయటకు రావాలంటే జంకే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చిన్నపిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు తీసుకురావడం ఇబ్బందికరంగా మారుతోంది. దీంతో వేసవి సెలవులను ఈ నెల 10 లేదా 15వ తేదీ వరకు పొడిగించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో మరో రెండు రోజుల్లో స్పష్టమైన ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# జాతీయ స్థాయిలో సత్తా...
# ఐదు ప్రతిష్టాత్మక అవార్డులు

మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాకు చెందిన 'శృంగవరం' గ్రామం సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్) విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసిన తిరుపతి జిల్లా 'బొక్కసంపాలెం' పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో మొదటి స్థానాన్ని సాధించింది. ఈ రెండు పంచాయతీలకు రూ.కోటి చొప్పున నగదు బహుమతి లభించింది.

జాతీయ స్థాయిలో సత్తా

పేదరిక నిర్మూలన, స్వయం సమృద్ధి విభాగాల్లోనూ రాష్ట్రానికి చెందిన పంచాయతీలు జాతీయ స్థాయిలో సత్తా చాటాయి. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన 'చెమ్ముడుపల్లి' గ్రామం పేదరిక నిర్మూలన విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని రూ.75 లక్షల నగదు బహుమతిని పొందింది. అలాగే, ప్రకాశం జిల్లాకు చెందిన 'గుండమాల' పంచాయతీ స్వయం సమృద్ధి విభాగంలో జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని సాధించి, రూ.50 లక్షల నగదు పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది.

సుస్థిరాభివృద్ధి విభాగంలో..

మరోవైపు పర్యావరణ పరిరక్షణ, వనరుల వినియోగం వంటి అంశాలతో కూడిన సుస్థిరాభివృద్ధి (సస్టైనబుల్ డెవలప్‌మెంట్) విభాగంలో చిత్తూరు జిల్లా 'కుప్పం' మండలం అద్భుత ప్రతిభ కనబరిచింది. జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని దక్కించుకున్న కుప్పం మండలానికి ఏకంగా రూ.కోటి 50 లక్షల భారీ నగదు బహుమతి లభించింది. మొత్తంగా ఈ అవార్డులు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, స్థానిక ప్రజాప్రతినిధుల కృషికి నిదర్శనంగా నిలిచాయి.

## నేటి నుంచి కొత్త రేట్లు....భూముల ధరలకు పెంపు

మొదటి పేజీ తరువాయి



పైగా ఆరో తేదీన రంగారెడ్డి జిల్లా కోహెడలో పండ్ల మార్కెట్ ఓపెనింగ్ ఉంది. అక్కడే రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదే వేదికపై మార్కెట్ ధరలను కూడా ప్రకటించడం బాగుంటుందన్న అభిప్రాయానికి వచ్చినట్లు అధికారుల నుంచి అందిన సమాచారం. దీంతో మరో రోజు మాత్రమే పాత భూముల ధరలు అమలు కానున్నాయి.

అంతా సిద్ధం.. ఆదేశాలే తరువాయి

మార్కెట్ వ్యాల్యూస్ రివిజన్ పూర్తయి చాలా రోజులైంది. ఈ మేరకు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేసి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు తొలుత ఈ నెల 4వ తేదీ నుంచి అమలు చేయాలని చెప్పారు. ఐతే వ్యూహాన్ని మరో రోజుకి వాయిదా వేశారు. దాని వెనుక రెండు అంశాలను చూపిస్తున్నట్లు సమాచారం. ఒకటేమో రూ.300 కోట్ల అదనపు ఆదాయం, రెండోది కోహెడలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన.. వీటిని ఆధారంగా చేసుకొని కసరత్తు చేస్తున్నారు. అంతా సిద్ధమైందనేది వాస్తవం. ఉన్నతాధికారులు ఒక్క క్లిక్ చేస్తే పాత రేట్లు మాయమై, కొత్త రేట్లు వెబ్‌సైట్‌లో దర్శనమిస్తాయంటున్నారు. అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు సబ్ రిజిస్ట్రార్లు తెలిపారు.

ఏడాదికోసారి లెక్క..

నిజానికి భూముల మార్కెట్ విలువలు ఏడాదికోసారి రివిజన్ చేయాలని మార్కెట్ వ్యాల్యూస్ గైడ్‌లైన్స్‌లో స్పష్టంగా ఉంది. ఐతే 2013 ఏప్రిల్ ఒకటో తేదీన పెంచిన ధరలను తిరిగి 2021 దాకా అమలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఏడేండ్ల వరకు పాత ధరలనే అమలు చేశారు. దీనికి కారణం లేకపోలేదు. పలు ఇరిగేషన్, ఇతర ప్రాజెక్టులు, ప్రజాప్రయోజనాల కోసం భూ సేకరణ పెద్ద ఎత్తున చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే ధరలను పెంచితే దానికి అనుగుణంగా ప్రభుత్వం నిర్వాసితులకు నష్టపరిహారం అందించాల్సి వస్తుంది. దాని వల్ల ప్రాజెక్టు వ్యయం పెరుగుతుంది. అందుకే ఏడేండ్ల వరకు భూ సేకరణ ప్రక్రియను చేపట్టారు. అంతా అయిపోయిన తర్వాత ధరల పెంపును ముందేసుకున్నారు. తొలుత కేసీఆర్ ప్రభుత్వం 2021లో ఒకసారి, 8 నెలల తర్వాత 2022లో మరోసారి పెంచింది. మళ్లీ నాలుగేండ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ విలువలను రివిజన్ చేసింది. ఐతే దీని ప్రభావం ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి.

# కాక్రోచ్ పార్టీ వెనుక ఉన్నది వాళ్లే..
# బీజేపీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** కాక్రోచ్ జనతా పార్టీ వెనుక అర్బన్ నక్సల్స్, కేజ్రీవాల్ లాంటి వాళ్ళు ఉన్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. జెన్‌జీ ఎప్పుడూ ఈ దేశంతో ఉంటుందన్నారు. తాజాగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేశ, రాష్ట్ర రాజకీయాలు, స్థితిగతుల గురించి మాట్లాడారు. ఎస్ఐఆర్ రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియ అని.. ఇది ప్రభుత్వం చేస్తున్నది కాదన్నారు. ఎలక్షన్ కమిషన్ ఈ ప్రక్రియను కొనసాగిస్తోందని చెప్పారు. ఇక తెలంగాణ అంశంపై ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు సభలో విజయ శాంతి, కేసీఆర్ ఇద్దరు లేరని గుర్తు చేశారు. పార్లమెంట్ బిల్లుకు బేషరతుగా బీజేపీ సపోర్ట్ చేసిందని తెలిపారు. తెలంగాణ ఎందరో యువకుల బలిదానంతో వచ్చిందని హితవు పలికారు. 12 సంవత్సరాలు అయిన ఇంకా తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించే పనిలోనే ఉన్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన వారిపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. నియామకాలు జరగలేదని.. రెండు ప్రభుత్వాలు వైఫల్యాలు చెందాయని ఎద్దేవా చేశారు. విద్య వ్యవస్థ నిర్వీర్యం అయిందని.. రూ. 10 వేల కోట్లు ఫీజు బకాయిలు ఉన్నాయన్నారు. రూ. 20 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితి దాపురించిందని చెప్పారు. నీటి మీద రెండు ప్రభుత్వాలకు ఒక పాలసీ లేదన్నారు. కాళేశ్వరంలో అవినీతి చేశారని.. తుమ్మిదిహట్టి అంటూ ఇప్పుడు కాంగ్రెస్ మాట్లాడుతుందన్నారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా వాటర్‌ను.. సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటకకు బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం కొరకుంట ప్రాజెక్ట్‌పై తెలంగాణ సంతకం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. "రాహుల్, డీకే శివకుమార్‌ల మెప్పు కోసం రేవంత్ రెడ్డి ఈ పని చేశారు. ఈ 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు రూ. 13 లక్షల కోట్లు వచ్చాయి. ఉత్తర తెలంగాణలో అన్ని మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ కన్నా బీజేపీ ఎక్కువ సీట్లు గెలిచింది. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌ఏ లేదు. దక్షిణ తెలంగాణలో బీజేపీ పెరుగుతుంది. వెస్ట్ బెంగాల్‌లో గెలిచినట్టు తెలంగాణలోనూ బీజేపీ గెలుస్తుంది. కేంద్ర పార్టీ కూడా తెలంగాణ మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. దక్షిణాదిలో బీజేపీకి గేట్ వేగా తెలంగాణ మారనుంది. బీజేపీ సిద్ధాంతం హిందుత్వ, బీజేపీ ఎజెండా అభివృద్ధి. తెలంగాణ రాజకీయాల్లో సూపర్ హీరో బీజేపీ. బీజేపీ ప్రజలతో, ప్రజల కోసం పని చేసింది. మహిళ రిజర్వేషన్‌లను కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యతిరేకించింది. సర్ ను రెండు పార్టీ లు వ్యతిరేకించాయి. స్టాలిన్ మీటింగ్ పెడితే రేవంత్ కేటీఆర్ కలిసి వెళ్లారు. మమ్మల్ని బూతం లెక్క చూపిస్తున్నారు. తెలంగాణకు నిజమైన బూతాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు. ఈ రెండు పార్టీలు తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్ళీ తీసుకుస్తున్నాయి. వాళ్ళ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ సెంటిమెంట్‌ను తెస్తున్నాయి. పవన్ కళ్యాణ్ సభకు అనుమతి ఇస్తే ఏమయ్యేది. ఈ ఇష్యూను బీజేపీ మీద ఎందుకు రుద్దుతున్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి మంత్రి పదవులు ఎందుకు ఇచ్చారు? ఆంధ్ర వాళ్లకు వ్యతిరేకంగా భాగో అన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే పైన ఏమీ చర్యలు తీసుకున్నారు? తెలంగాణలో పొత్తు అంశాన్ని జాతీయ పార్టీ డిసైడ్ చేస్తుంది. ఎన్నికలకు ఇంకా మూడు సంవత్సరాలు ఉంది. ఈ దేశ లో ఎవరు ఎక్కడి నుంచైనా పోటీ చేయొచ్చు." అని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం
# 3 అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ దగ్ధం

మొదటి పేజీ తరువాయి




ఈ భవనం చుట్టుపక్కల హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్, సెల్ ఫోన్ షాపులు ఉన్నాయి. మండుతున్న ఎండల తీవ్రత వల్ల మంటలు వేగంగా పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు వ్యాపిస్తున్నాయి.

దీంతో అప్రమత్తమైన తోటి వ్యాపారులు తమ షాపుల్లోని విలువైన వస్తువులను తీసుకొని బయటకు పరుగులు తీశారు. విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బట్టల షాపు కావడంతో మంటల తీవ్రత అత్యధికంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేస్తూ, అవి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా రక్షణ చర్యలు చేపట్టారు. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమికంగా తెలిసింది. మంటల్ని అదుపులోకి తీసుకొచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు, ఫైర్ సిబ్బంది తెలిపారు. కాగా, మంటల తీవ్రత చూస్తుంటే భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పక్క దుకాణాలకు కూడా మంటలు వ్యాపిస్తుండటంతో నష్టం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఢిల్లీలోనూ ఘోర అగ్ని ప్రమాదం..

దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్ ప్రాంతంలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో మొత్తం 21 మంది మరణించారు. మృతులలో 11 మంది విదేశీయులు కాగా.. మిగిలిన 10 మంది భారతీయులు. చికిత్స కోసం సమీపంలోని మ్యాక్స్ ఆసుపత్రికి వచ్చిన వారు ఫ్లరిష్ స్టే హోటల్‌లో బస చేసినట్లు తెలిసింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెస్టారెంట్‌లో ఉదయం గం. 8:30 ల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి క్షణాల్లో మిగిలిన అంతస్తులకు వ్యాపించాయి. భవనానికి ఒకే ఒక ఎగ్జిట్ పాయింట్ ఉండటం, కట్టడానికి ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీ లేకపోవడం వల్ల ప్రాణనష్టం పెరిగింది. ప్రమాద సమయంలో దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఊపిరాడక చాలా మంది చనిపోగా.. కొందరు ప్రాణాలు రక్షించుకోవడానికి కిటికీల నుంచి కిందకు దూకారు. స్థానికులు వెంటనే స్పందించి కింద పరుపులు పరిచి దాదాపు 8 మంది ప్రాణాలు కాపాడారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది 40 మందికి పైగా సురక్షితంగా రక్షించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు హోటల్ యజమాని లవకేష్ బజాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# మమతకు మరో షాక్.. బీజేపీలోకి
# 20 మంది టీఎంసీ ఎంపీలు



**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లో విభజన స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే మమతా బెనర్జీకి 60 మంది ఎమ్మెల్యేలు భారీ షాక్ ఇచ్చారు. మమత ప్రతిపక్ష నేతగా నియమించిన శోవన్‌దేబ్ చటోపాధ్యాయను తాము ఒప్పుకోబోమని చెబుతూ.. మెజారిటీ ఎమ్మెల్యేలు రీటబ్రత బెనర్జీని తమ నేతగా ఎన్నుకున్నారు. బుధవారం 58 మంది ఎమ్మెల్యేలు సంతకం చేసిన లేఖను స్పీకర్‌కు సమర్పించడంతో రీటబ్రత బెనర్జీ ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఇదే కాకుండా మమతకు నమ్మినబంటుగా ఉన్న ఫిర్హాద్ హకీమ్ కోల్‌కతా మేయర్ పదవికి రాజీనామా చేశారు.

బీజేపీలోకి 20 మంది ఎంపీలు: ఇదిలా ఉంటే, ఇప్పుడు ఎంపీల్లో కూడా విభజన స్పష్టంగా కనిపిస్తోంది. సమాచారం ప్రకారం దాదాపుగా 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని, త్వరలోనే పార్టీ మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ చర్చలు తీవ్రంగా సాగుతున్నాయని సమాచారం. ప్రస్తుతం టీఎంసీకి పార్లమెంట్‌లో 28 మంది లోక్‌సభ ఎంపీలు, 13 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. మెజారిటీ ఎంపీలు బీజేపీతో చేరితే మమతా బెనర్జీ కష్టాలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

## థాయ్‌లాండ్-హైదరాబాద్ డ్రగ్స్ లింక్ బట్టబయలు..
## ఈగల్ టీమ్ దెబ్బకు ఇంటర్నేషనల్ ముఠా గుట్టురట్టు

**న్యూస్ డెస్క్, 04 జూన్ (ఇది కద నిజం):** గంజాయి స్మగ్లింగ్ ముఠాపై తెలంగాణ ఈగిల్ ఫోర్స్ పంజా విసిరింది. అంతర్జాతీయ హైడ్రోపోనిక్ గంజాయి స్మగ్లింగ్ ముఠాను చేదించింది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అక్రమ రవాణా చేస్తున్న ఓ వ్యక్తి వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని పోలీసులు, కస్టమ్స్ అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ లో సంచలన విషయాలు వెలుగు చూశాయి. థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్‌ను నడిపిస్తూ సుమారు 300 మంది క్యారియర్లను ఉపయోగించి థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయిని తరలించినట్లు ఈగిల్ ఫోర్స్ గుర్తించింది.

రూటు మార్చి మాదకద్రవ్యాల రవాణ:

థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అధిక టీఎచ్సి శాతం కలిగిన ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఈ ముఠా గతంలో అరుదైన వస్తువుల స్మగ్లింగ్ లో పాల్గొనేదని పోలీసులు తెలిపారు. అయితే 2023 నుంచి రూట్ మార్చిన ఈ గ్యాంగ్ అప్పటి నుంచి వస్తువుల స్మగ్లింగ్ స్థానంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టి సారించినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. 2026 ఏప్రిల్ 8న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు బ్యాంకాక్ నుంచి వచ్చిన సోధా మొహసన్ బహదూర్ భాయ్ అనే ప్రయాణికుడి వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ముంబై--హైదరాబాద్--థాయ్‌లాండ్ నెట్‌వర్క్:

సోధా మొహసన్ బహదూర్ భాయ్ అరెస్టు అనంతరం రాచకొండ పోలీసులు, కస్టమ్స్ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో హరషద్ మన్‌సుఖ్ భాయ్ ప్రజాపతి, సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్‌లను అరెస్ట్ చేసి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో ఈ ముఠా థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు బయటపడింది. గుజరాత్‌కు చెందిన దల్ అబ్దుల్లా సదుద్దీన్ నాయ్ అనే వ్యక్తి యువకులను ప్రలోభపెట్టి థాయ్‌లాండ్ నుంచి గంజాయి రవాణా చేయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఎన్డిపిఎస్ చట్టంలోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహిత కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో మొత్తం 40 మంది నిందితులను గుర్తించారు. వీరిలో పలువురు అరెస్టు కాగా, మరికొందరు పరారీలో ఉన్నారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్ ఈ రాకెట్‌కు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. అతడు, అతని సోదరుడు సుధాంశు కెలుస్కర్ థాయ్‌లాండ్‌లో క్లబ్ వ్యాపారం నిర్వహిస్తూ గంజాయి స్మగ్లింగ్‌కు కేంద్రంగా ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ స్మగ్లింగ్?లో కస్టమ్స్ నిఘా నుంచి తప్పించుకోవడానికి వివిధ విమానాశ్రయాలను మారుస్తూ అక్రమ రవాణా కొనసాగించినట్లు అధికారులు తెలిపారు.

యువతకు ఈగిల్ ఫోర్స్ హెచ్చరిక:

గంజాయి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి, భవిష్యత్తుకు హానికరమని ఈగిల్ ఫోర్స్ హెచ్చరించింది. యువత డ్రగ్స్, హానికర ఇంజెక్షన్లు, నియంత్రణలేని సప్లిమెంట్లకు దూరంగా ఉండాలని సూచించింది. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 1908 నంబర్ లేదా ఈగిల్ ఫోర్స్ అధికారిక మార్గాల ద్వారా అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# మొహర్రం ఏర్పాట్లపై ఇంత నిర్లక్ష్యమా?

- మొహర్రం కు 12 రోజులే ఉన్న కనీసం సమీక్ష సమావేశం నిర్వహించరా?
- వెంటనే ఏర్పాట్ల పనులు వేగవంతం చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం,హైదరాబాద్ : మొహర్రం ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. మొహర్రం మాసానికి ఇంకా 12 రోజులు మాత్రమే ఉన్నప్పటికీ ఇప్పటికీ కూడా ఏర్పాట్ల ప్రక్రియ ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొహర్రం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవటం శోచనీయన్నారు. ప్రతిష్టాత్మకమైన 'బీబీ కా ఆలమ్' ఊరేగింపులో పాల్గొనే ఏనుగును తెప్పించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదన్నారు. అటు తెలంగాణవ్యాప్తంగా ఉన్న 11,836 ఆషూర్ ఖానాలకు ఇవ్వాల్సిన నిధులకు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గుర్తు చేశారు. మొహర్రంను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే సమీక్ష నిర్వహించి, ఏర్పాట్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

# పెరుమాళ్లు మృతి పార్టీకి తీరని లోటు: కొన్నె లక్ష్మయ్య



ఇది కద నిజం, కుక్కునూరు: సీపీఐ కుక్కునూరు సీనియర్ నాయకులు గవర్ల పెరుమాళ్లు మృతి పార్టీకి తీరని లోటుని కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య పేర్కొన్నారు. బంజరగూడెంలో గురువారం నాయకులు మైసాక్షి వెంకటాచారి అధ్యక్షతన పెరుమాళ్లు సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల మాట్లాడారు. పెరుమాళ్లు ఐదు శతాబ్దాల పాటు సీపీఐ పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి విశేష కృషి, సేవలందించారని కొనియాడారు. పోడు సర్టిఫికెట్ల కోసం ఉద్యమం సాగించిన ఘనత ఆయనకే దక్కిందని గుర్తుచేశారు. ఎనిమిది పదుల వయసులో కూడా పెరుమాళ్లు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. సభలో స్థానిక సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పర్సిక రాజు పాల్గొన్నారు.





# టిఆర్ఎస్ జెండా కూల్చితే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తున్నాం: మేడి నరేష్

ఇది కద నిజం,నాగార్జునసాగర్ నియోజకవర్గం : కల్వకుంట్ల కవిత ఆదేశానుసారం తెలంగాణ రక్షణ సేన పార్టీ యొక్క జెండాను నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జెండా పండుగ కార్యక్రమానికి సిద్ధం చేసుకున్నటువంటి పార్టీ యొక్క జెండా దిమ్మను కాంగ్రెస్ పార్టీ గుండా నాయకులు కూల్చి వేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ చేసిన పని ఇది సిగ్గుమాలిన చర్య అని హెచ్చరిక జారీ చేస్తున్నానని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర నాయకులు మేడి నరేష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభం అయ్యిందని తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని తెలియజేశారు. నాగార్జున సాగర్ లో టీఆర్ఎస్ జెండా ఎగురుతుందని భయం ప్రారంభం అయ్యిందని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరి,సురేష్,బా తదితరులు పాల్గొన్నారు.

# కారు డిక్కీలో చిక్కి కడతేరిన బాలుడు

కారు డిక్కీలో చిక్కుకుని ఊపిరి ఆడక బసవప్రభు అనే మూడున్నరేళ్ల బాలుడు కొన ఊపిరి వదిలాడు. కర్ణాటకలోని కలబురగి జిల్లా శహబాద్ తాలూకా తోనసహళ్లి (ఎస్) గ్రామంలో కొట్టూరేశ్వర ముత్యా అనే వ్యక్తి తన కుమారుడ్ని నర్సరీలో చేర్పించేందుకు స్థానిక పాఠశాలకు గురువారం ఆ బాలుడ్ని తీసుకువెళ్లారు. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రిన్సిపల్‌తో మాట్లాడుతుండగా, తండ్రి వద్ద ఉన్న కారు తాళాన్ని బసవ ప్రభు తీసుకున్నాడు. బయటకు వచ్చి తాళం రిమోట్‌తో డిక్కీ తెరిచి, లోపల కూర్చుని మళ్లీ మీట నొక్కడంతో అది మూత పడిపోయింది. మళ్లీ డిక్కీ తెరవడం సాధ్యం కాక, ఊపిరి అందక, భయంతో మరణించాడని గుర్తించారు. కొట్టూరేశ్వర ముత్యా వెంటనే వెలుపలికి వచ్చి, కుమారుడి కోసం వెతికినా ప్రయోజనం లేకపోయింది. అనుమానంతో డిక్కీని బలవంతంగా తెరిచి చూడగా అందులో కుమారుని మృతదేహం కనిపించింది. ఆవేదనతో దంపతులు కుప్పకూలిపోయారు. శహబాద్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





# సాగర్ లో టీఆర్ఎస్ జెండా గద్దె కూల్చివేత

**నందికొండ మున్సిపల్ అధికారుల ఓవరాక్షన్**
**టీఆర్ఎస్ జెండా గద్దె కూల్చివేత.. ఇతర పార్టీల గద్దెల జోలికి వెళ్లని అధికారులు**
**కాంగ్రెస్ నేతల ఒత్తిడితోనే తమ పార్టీ గద్దె కూల్చేశారన్న టీఆర్ఎస్ నాయకులు**
**నడికొండ మున్సిపల్ ఆఫీస్ ముందు బైఠాయింపు**

ఇది కద నిజం,నాగార్జున సాగర్ :

నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని నడికొండ మున్సిపల్ అధికారులు ఓవరాక్షన్ చేశారు. సాగర్ పైలాన్ క్రాస్ రోడ్డు వద్ద నిర్మించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెను అక్రమంగా కూల్చేశారు. అదే స్థలంలో ఉన్న ఇతర పార్టీల జెండా గద్దె జోలికి వెళ్లకుండా టీఆర్ఎస్ జెండా గద్దెను మాత్రమే కూల్చేశారు. ఈ చర్యపై టీఆర్ఎస్ నాయకులు భగ్గుమన్నారు. నడికొండ మున్సిపల్ అధికారుల తీరుకు నిరసనగా మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**ఎందుకంత వణుకు?**

సాగర్ పైలాన్ క్రాస్ రోడ్డు వద్ద అన్ని పార్టీల జెండా గద్దెలు ఉన్నప్పటికీ ఒక్క టీఆర్ఎస్ జెండా గద్దెనే టార్గెట్ చేయటమేమిటనీ టీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. నడికొండ మున్సిపల్ కమిషనర్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గుండాల ఒత్తిడితోనే మున్సిపల్ అధికారులు పార్టీ జెండాను గద్దెను కూల్చేశారని ఆరోపించారు. గత నెల 20 తారీఖు నుంచి టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తున్నామని రాష్ట్రంలో ఎక్కడ లేని సమస్య ఇక్కడే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. టీఆర్ఎస్ అంటే ఎందుకంతా వణుకు అంటూ నిలదీశారు.

**పోలీసులతో వాగ్వాదం**

మున్సిపల్ అధికారుల తీరుపై నల్గొండ జిల్లా టీఆర్ఎస్ ఇంఛార్జ్ విక్రాంత్ రెడ్డి, నాగార్జున సాగర్ ఇంఛార్జ్ బాలు నాయక్, నాగార్జున సాగర్ అబ్జర్వర్ బోడుపల్లి లింగం, దేవరకొండ ఇంఛార్జ్ శివ నాయక్, నల్గొండ ఇంఛార్జ్ డి. సరిత, నల్గొండ అబ్జర్వర్ బొల్లంపల్లి సందీప్ తో పాటు టీఆర్ఎస్ నాయకులు ఉమ మహేశ్వరీ, సోమయ్య, కిషోర్, మంగయ్య, సైది, చందర్ భామిని, చతు లు మండిపడ్డారు. మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగిన టీఆర్ఎస్ నాయకులను శాంతిపజేసేందుకు పోలీసులు ప్రయత్నించగా వారితో వాగ్వాదానికి దిగారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరులే ఈ దుర్మార్గానికి కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అక్రమాలను ప్రజలను గమనిస్తున్నారని తప్పకుండా వారికి సరైన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. టీఆర్ఎస్ గద్దె కూల్చిన చోటే మళ్లీ పార్టీ గద్దె ను నిర్మిస్తామన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

- ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల



ఇది కద నిజం, కుక్కునూరు: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కుక్కునూరు మండలంలో ఘనంగా జరిగాయి. సోడే వెంకటమ్మ అధ్యక్షతన జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చలేదని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఆడబిడ్డ నిధి పథకం క్రింద రూ. 1500 రూపాయలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలను చులకనగా, యంత్రాల్లా చూడవద్దని మహిళలకు స్వాతంత్రంగా జీవించే హక్కు ఉందని ఆమె తెలిపారు. మహిళలు సాధికారత కోసం సామూహిక పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలని, మహిళల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి మహిళ ముందుండి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాయంచిట్టెమ్మ, సోడె ముత్తమ్మ, దుర్గ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహణ

**పిట్లం ఎస్ఐ ఆంజనేయులకు సన్మానం**







ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, జూన్ 4: ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చిన్న గౌరారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రత్యేక అధికారి గంగారం (ఏపీఎం), పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

అనంతరం గ్రామానికి విచ్చేసిన పిట్లం ఎస్ఐ ఆంజనేయులను సర్పంచ్ లోకినేని హనుమంతరావు శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కుక్కునూరును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం: ములిశెట్టి నాగు



ఇది కద నిజం, కుక్కునూరు: కుక్కునూరు మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు (నాగు) అన్నారు. తెలుగుదేశం పార్టీ (కూటమి) ఘన విజయం సాధించి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కుక్కునూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మొలిశెట్టి నాగేశ్వరరావు సమక్షంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మొలిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ పాలన సాగిస్తున్నామని చెప్పారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, రమణరాజు, కరేటి అప్పారావుతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని నియోజకవర్గ ప్రగతిపై హర్షం వ్యక్తం చేశారు.

# రాపూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ని కలిసిన బీజేపీ నాయకులు



నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం):-నెల్లూరు జిల్లా రాపూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యం. శ్రీనివాసరావుని రాపూరు మండలం భారతీయ జనతా పార్టీ దూడల పెంచలయ్యఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ యం.శ్రీనివాసరావు కి బీజేపీ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారంపై వారు కాసేపు చర్చించారు. నూతన సి.ఐ.కి బీజేపీ నాయకులు తన పక్షాన శుభాకాంక్షలు తెలియజేస్తూ, విధి నిర్వహణలో ఆయనకు పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దూడల పెంచలయ్య,రాపూరు మండలం ప్రధాన కార్యదర్శి మనుబోలు శివప్రసాద్, బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా సామర్ల జయసింహ, బిజెపి సీనియర్ నాయకులు ప్రదీప్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు గంటా శంకుస్థాపన

భీమిలి, జూన్ 3: జోన్ లోని 4 వార్డుల్లో రూ.6.20 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 వ వార్డు సంగివలస నుంచి పాండ్రంగి మధ్య శిథిలమైన కాజ్ వే స్థానంలో రూ. 1.43 కోట్లతో మైనర్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, రూ.50 లక్షలు వెచ్చించి 3వ వార్డులో పరిధిలోని గంట స్తంభాన్ని అందమైన డిజైన్ తో పునరుద్ధరిస్తున్నామని వివరించారు. రూ.47 లక్షలతో ఆదర్శనగర్ లో చేపల మార్కెట్, వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, పార్కులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోందని, నియోజకవర్గంలోని 9 జీవీఎంసీ వార్డుల్లో రూ.200 కోట్ల విలువైన పనులు చేపట్టామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభమైన తర్వాత భీమిలి జోన్ లో అభివృద్ధి పరుగులు తీస్తుందని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్, ఈఈ వాసు, డీఈ సురేష్, కూటమి నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, గాడు చిన్ని కుమారి లక్ష్మి, శాఖారి శ్రీనివాస్, నమ్మి. శ్రీరామ్ చురకల రమణ, జీరు సత్యం, కంటుభుక్త రామానాయుడు, కనకల అప్పలనాయుడు, పాసి నర్సింగరావు, గరికిన ఎల్లాజీ (కింగ్), పరిమి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




# నా మనసంతా దానిపైనే ఉంది

## మెగాస్టార్ చిరంజీవి ట్వీట్ వైరల్



గ్లోబల్ రామ్ చరణ్ నటించిన మోస్ట్ ఎవైటెడ్ చిత్రం 'పెద్ది' గురువారం ప్రపంచవ్యాప్తంగా రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ టాక్ సొంతం చేసుకుని దూసుకుపోతుంది. ఇప్పటికే ఈ సినిమా వీక్షించిన మెగా ఫ్యామిలీ తమ రివ్యూ ట్విట్టర్ వేదికగా తెలుపగా.. తాజాగా మెగాస్టార్ చిరంజీవి ఓ పోస్ట్ షేర్ చేశారు. 'నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా "పెద్ది" దగ్గరే ఉంది. గత రెండేళ్లగా ఈ సినిమా కోసం చరణ్ పడ్డ కష్టం, చూపించిన శ్రద్ధాశక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. "పెద్ది" పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయితీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబు సానాకి నా ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన వెంకట సతీష్ కిలారుకి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించిన నా మిత్రుడు, "కరునాడ చక్రవర్తి" శ్రీ శివన్న గారికి, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగపతిబాబు గారికి అభినందనలు. అద్భుతమైన పాటలు, హృదయాన్ని కదిలించిన నేపథ్య సంగీతాన్ని అందించిన ఏఆర్ రెహమాన్ గారికి, ఈ చిత్రం విజయంలో భాగమైన జాన్వీ కపూర్, దివ్యేందు ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, అలాగే వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలకు నా హృదయపూర్వక అభినందనలు. "పెద్ది" సాధించిన ఈ ఘన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపాడు.

# తమిళ ఇండస్ట్రీలో మైత్రి జోరు

## స్టార్ హీరోలతో వరుస ప్రాజెక్ట్స్

MYTHRI MOVIE MAKERS

తెలుగు సినిమా పరిశ్రమలో తక్కువ సమయంలోనే అగ్ర నిర్మాణ సంస్థలలో ఒకటిగా ఎదిగిన మైత్రి మూవీ మేకర్స్ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతోంది. తెలుగులో భారీ ప్రాజెక్టులను నిర్మిస్తూ సక్సెస్ సాధిస్తున్న ఈ సంస్థ ఇప్పుడు తమిళ ఇండస్ట్రీపై కూడా ఫుల్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోలీవుడ్‌లో పలువురు స్టార్ హీరోలతో ప్రాజెక్టులను సెట్ చేసినట్లు సమాచారం. ధనుష్ హీరోగా దర్శకుడు సిరుతై శివ కాంబినేషన్‌లో ఓ మూవీని దాదాపు ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది.

అలాగే శింబు – కీర్తి సురేష్ కాంబోలో మరో సినిమా, శివకార్తికేయన్ – జగన్ శక్తి కాంబినేషన్‌లో ఇంకో మూవీని మైత్రి మూవీ మేకర్స్ నిర్మించబోతున్నట్లు సమాచారం. ఈ మూడు ప్రాజెక్టులు సెట్స్‌పైకి వెళ్తే తమిళ ఇండస్ట్రీలో మైత్రి మూవీ మేకర్స్‌కు మంచి క్రేజ్ రావడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ ఈ సినిమాలు మంచి విజయాలు సాధిస్తే కోలీవుడ్‌లో కూడా ఈ బ్యానర్ బలమైన స్థానం సంపాదించే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మరోసారి వాయిదా పడిన 'టాక్సిక్'

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రుక్మిని వసంత్, నయనతార, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రలో కనిపించనున్నారు. డ్రగ్స్ మాఫియా చుట్టూ తిరిగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. ఇందులోంచి వచ్చిన టీజర్ సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఇక ముందుగా మార్చిలో విడుదల చేయాలనుకున్న మేకర్స్ పలు కారణాల వల్ల జూన్ 4న వాయిదా వేశారు. నిజానికి ఈ సినిమాను జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించారు.

అయితే సినిమా రిలీజ్ కావాల్సి ఉన్నా, ఎలాంటి ప్రమోషన్స్ కానీ, అప్‌డేట్స్ కానీ లేకపోవడంతో సోషల్ మీడియాలో పలు రకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. మూవీ షూటింగ్ పూర్తయినప్పటికీ షాకింగ్ ట్విస్ట్ వచ్చి పడింది. అయితే కొన్ని సీన్స్ విషయంలో హీరో యష్ అసంతృప్తిగా ఉన్నారని.. అందుకే ఏకంగా 100 రోజుల పాటు కొన్ని కీలక సన్నివేశాలను రీషూట్ చేయాలని నిర్ణయించుకున్నట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. దీనికి తోడు విదేశీ పంపిణీ పరంగా కొన్ని సమస్యలు తలెత్తడం కూడా వాయిదాకు కారణమని అంటున్నారు. ఈ కారణాల వల్లే సినిమాను వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ, థియేటర్లలో చూడాల్సిన సినిమా ఇలా వాయిదా పడటం.. రీషూట్ వార్తలు రావడం చూసి యష్ ఫ్యాన్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నిజంగానే ఇప్పట్లో విడుదల చేయరేమో అని పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.




# 'స్లమ్‌డాగ్' నుంచి బిగ్ అప్డేట్!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబోలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'స్లమ్ డాగ్'. ఇది '33టెంపుల్ రోడ్' అనే ట్యాగ్‌లైన్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను 'పూరి కనెక్ట్స్' బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ కలిసి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. వీరితో పాటు జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై జేబీ నారాయణ రావు కూడా ఈ నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈక్రమంలో.. తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన ఓ బిగ్ అప్డేట్ రాబోతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను జూన్ 8న విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్.



ఇప్పటికే ఈ మూవీ నుండి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్స్ ప్రేక్షకులలో, ముఖ్యంగా విజయ్ సేతుపతి ఫ్యాన్స్‌లో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇప్పుడు టీజర్ కూడా రాబోతుండటంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోస్టులు విపరీతంగా వైరల్ అవుతున్నాయి పూరి జగన్నాథ్ మార్క్ మాస్ ఎలిమెంట్స్, విజయ్ సేతుపతి పవర్‌ఫుల్ యాక్టింగ్ కలగలిసిన ఈ 'స్లమ్ డాగ్' చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు అన్ని ప్రధాన భారతీయ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన టాలెంటెడ్ బ్యూటీ సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే టాలీవుడ్, బాలీవుడ్ సీనియర్ నటి టబు, కన్నడ స్టార్ నటుడు దునియా విజయ్ కుమార్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. 'యానిమల్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందిస్తున్నారు.